10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం | 2 అక్టోబర్ 2024 | పేజీలు 8



- తిరుమలాయపాలెం మండలం కాకరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వేడుకలు..
- ప్రధానోపాధ్యాయులు నల్లగుంట్ల మధు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు..
- బచ్చోడు కాంప్లెక్స్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ ఆటపాటలు, ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణమోహన్.
- కాకరవాయి ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగార్జున రావు..
- బచ్చోడు,కాకరవాయి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు.
- రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో అలరించిన విద్యార్థిని విద్యార్థులు.

# ప్రభుత్వ పాఠశాలల్లో... బతుకమ్మ సంబరాలు

**ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు బతుకమ్మ ముందస్తు ఉత్సవాలు..**






కాకరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు బతుకమ్మ సంబరాలు..

-2లో

## మూసీ నిర్వాసితుల వినతుల స్వీకరణకు.. కలెక్టరేట్‌లో గ్రివియన్స్ సెల్..!



మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 1:**మూసి బాధితుల రీషెల్టర్ సౌకర్యార్థమై మేడ్చల్- మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ల్యాండ్ ప్రొటెక్షన్ సెక్షన్‌లో ప్రత్యేకంగా గ్రివియన్స్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ గౌతమ్ పొట్రు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూసీ నిర్వాసితుల వినతులను సమస్యలను తెలుసుకునేందుకు గాను జిల్లా కలెక్టరేట్‌లోని ఈ సెల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. బాధితులు నేరుగా ఈ గ్రీవెన్స్ సెల్‌లో అందుబాటులో ఉన్న టెలిఫోన్ నెంబర్‌ను కార్యాలయ పని దినాలలో 9492409781 సంప్రదించవచ్చని కలెక్టర్ వివరించారు..

## మూసీ నది ఒడ్డున మొదలైన కూల్చివేతలు

- స్వచ్ఛందంగా ఖాళీ చేసిన వారి ఇళ్లను కూల్చేస్తున్న అధికారులు
- బుల్డోజర్లు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కూలీల ఏర్పాటు
- నిర్వాసితులను తరలించేందుకు వాహనాలు సమకూర్చిన సిబ్బంది

-2 లో



# ప్రభుత్వ పాఠశాలల్లో.. బతుకమ్మ సంబరాలు..





కాకరవాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు..



**తిరుమలాయపాలెం,పెన్ పవర్,అక్టోబర్ 1:** పండుగలు మతసామరస్యానికి ప్రతీకలని,ఐక్యతకు నిదర్శనమని కాకరవాయి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు నల్లగుంట్ల మధు, బచ్చోడు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణ మోహన్ అన్నారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామం, బచ్చోడు గ్రామ పరిధిలోని జెడ్.పి.హెచ్.ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. కాకరవాయి జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు నల్లగుంట్ల మధు, బచ్చోడు కాంప్లెక్స్ హెచ్ఎం కృష్ణ మోహన్, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు నాగార్జున రావు ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాల ప్రిన్సిపాల్ లు మాట్లాడుతూ.. పండుగలు మత సామరస్యానికి ప్రతీకలని, ఐక్యతకు నిదర్శనమని అన్నారు. సహజ సిద్ధంగా దొరికే రంగురంగుల పూలతో బతుకమ్మను మహిళలు నిష్టతో పేర్చి పసుపుతో తయారు చేసిన గౌరమ్మను ప్రతిష్ఠిస్తారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మను ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోందని ఆయన అన్నారు. అనంతరం బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు.విద్యార్థిని విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆటపాటలతో అలరింప చేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







# మూసీ నది ఒడ్డున మొదలైన కూల్చివేతలు

**హైదరాబాద్ పెన్ పవర్:**మూసీ నది ప్రక్షాళనలో భాగంగా నదీపరీవాహక ప్రాంతంలోని ఇళ్లను మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ కూల్చివేస్తోంది. శంకర్ నగర్ లో అధికారులు మంగళవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. స్వచ్ఛందంగా ఖాళీ చేసిన వారి ఇళ్లను నేలమట్టం చేస్తున్నారు. ఇరుకు సందులు కావడంతో బుల్డోజర్లు వెళ్లే పరిస్థితి లేక కూలీలను పెట్టి పనికానిస్తున్నారు. నిర్వాసితులను ఇప్పటికే చంచల్‌గూడ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి తరలించారు. మరికొంతమంది నిర్వాసితులను తరలించేందుకు, ఇళ్లల్లోని సామగ్రి తీసుకెళ్లేందుకు అధికారులు వాహనాలను ఏర్పాటు చేశారు. మూసీ సుందరీకరణ పనుల్లో భాగంగా రివర్ బెడ్ పరిధిలో సుమారు 55 కి.మీ పరిధిలో 40 వేల ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. చాదర్‌ఘాట్ మూసీ పరీవాహక ప్రాంతాల్లోని మూసానగర్, రసూల్‌పుర, వినాయక్‌నగర్ పరిసరాల్లో ఇళ్లకు రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేశారు. ఇందులో ప్రస్తుతం స్వచ్ఛందంగా ఖాళీ చేసిన వారి ఇళ్ల కూల్చివేతను ప్రారంభించారు.

- హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2లో కుత్బుల్లాపూర్‌కి మెట్రో విస్తరించాలని కోరిన ఎమ్మెల్యే..
- బేగంపేట్ మెట్రో రైల్ భవన్‌లో మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేత..
- వేగంగా అభివృద్ధి చెందుతున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వివిధ రాష్ట్రాల ప్రజల నివాసం..
- నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళి నిత్యం ఉద్యోగం చేసుకునేందుకు ఇబ్బందులు..
- ఎమ్మెల్యే వెంట దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు..
- కుత్బుల్లాపూర్- సుచిత్ర- కొంపల్లితో పాటు ఐడీపీఎల్ -చింతల్ -షాపూర్ నగర్ -జీడిమెట్ల -సూరారం..
- గండిమైసమ్మ,సూరారం- జీడిమెట్ల- షాపూర్ నగర్- చింతల్- బాలానగర్ చౌరస్తా మీదుగా భరత్ నగర్..


మెట్రో ఎండికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్, పలువురు బీఆర్ఎస్ నేతలు..

# మెట్రో ఎండి ఎన్‌వీఎస్ రెడ్డికి.. ఎమ్మెల్యే వినతిపత్రం..

## మెట్రో సేవలను మరింత విస్తరించాలని ఎమ్మెల్యే కే.పి.వివేకానంద్ వినతిపత్రం..




మెట్రో ఎండికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, కౌన్సిలర్, పలువురు బీఆర్ఎస్ నేతలు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 1:** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా మహానగర ప్రజలకు తన సేవలను అందిస్తున్న..! హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) ఫేజ్ -2లో కుత్బుల్లాపూర్‌కి మెట్రో సేవలను విస్తరించాలని..! ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బేగంపేట్ లోని హైదరాబాద్ మెట్రో రైల్ భవన్‌లో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ నిత్యం ఎంతోమంది ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చుతూ దేశంలోనే మూడవ అతిపెద్ద మెట్రో రైల్ సంస్థగా, నిలిచిన హైదరాబాద్ మెట్రో రైల్‌ను విస్తరించాలని, భావిస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, మెట్రో రైల్ ఫేజ్ -2 విస్తరణలో కుత్బుల్లాపూర్ ప్రాంతానికి ప్రాధాన్యత ఇవ్వాలని మెట్రో ఎండి ఎన్‌వీఎస్ రెడ్డిని కోరారు.. భాగ్యనగరంలో భాగమైన కుత్బుల్లాపూర్ అతివేగంగా అభివృద్ధి చెందుతుందని..!ఈ ప్రాంతం నుంచి లక్షలాది మంది ఉద్యోగులు నగరంలోని వివిధ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని వివేకానంద వివరించారు.. కుత్బుల్లాపూర్- సుచిత్ర - కొంపల్లిహ్రాంతాలతో పాటు ఐడీపీఎల్ -చింతల్ -షాపూర్ నగర్ - జీడిమెట్ల -సూరారం -దుండిగల్ ప్రాంతాల నుంచి నిత్యం లక్షలాదిమంది ప్రయాణిస్తుంటారని.. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణలో భాగంగా.. రూట్ -1: గండి మైసమ్మ నుంచి సూరారం - జీడిమెట్ల - షాపూర్ నగర్ - చింతల్ - బాలానగర్ చౌరస్తా మీదుగా భరత్ నగర్ మెట్రో స్టేషన్‌లో కలిపేందుకు..! అదేవిధంగా రూట్ -2 :హోమేడ్చల్ నుంచి కొంపల్లి - సుచిత్ర -బోయిన్ పల్లి - మీదుగా సికింద్రాబాద్‌కి మెట్రో రైల్ మార్గాన్ని ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు..
మెట్రో ఎండీని కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు దుందిగల్ మున్సిపల్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

# హైదరాబాద్‌లో భారీ వర్షం... పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈరోజు సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో చాలా ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచింది. దీంతో చాలా ప్రాంతాల్లో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పంజాగుట్ట-అమీర్‌పేట రోడ్డు చెరువును తలపిస్తోంది.సచివాలయం, ట్యాంక్‌బండ్, లక్డీకాపూల్, హిమయత్ నగర్, ఖైరతాబాద్, బషీర్ బాగ్, అబిడ్స్, నాంపల్లి, కోఠి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, కూకట్‌పల్లి, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, నిజాంపేట, కేపీహెచ్‌బీ కాలనీ, మూసాపేట, ప్రగతి నగర్, జగద్గిరిగుట్ట, జీడిమెట్ల, షాపూర్ నగర్, సూరారం, బహదూర్ పల్లి, పేట్ బషీరాబాద్, కొంపల్లి, మేడ్చల్, కండ్లకోయ, దుండిగల్, కృష్ణాపూర్, గౌడవెల్లి, బోయినపల్లి, మారేడ్‌పల్లి, చిలకలగూడ, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట, అల్వాల్, జవహర్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.



# అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి.. స్థలాన్ని పరిశీలించిన డిఎంహెచ్ఓ..

- **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి..**
- **కీసర డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యవతి..**






**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 1:** మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో కొత్తగా నిర్మించబోయే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి) కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాన్ని సందర్శించి పరిశీలించిన డిఎంహెచ్ఓ డాక్టర్ టి.రఘునాథ్ స్వామి..

బోడుప్పల్‌లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం కేటాయించిన సంబంధిత స్థలం అనుకూలతను

జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మంజులా రెడ్డి, వైద్య అధికారి డాక్టర్ శోభనా, బస్తీ దవాఖాన వైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్‌లతో కలిసి డిఎంహెచ్ఓ రఘునాథ్ స్వామి బృందం పరిశీలించారు..ఈ యుపిహెచ్‌సి స్థాపనతో నగర జనాభాకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి సహకారం అందుతుందని తెలిపారు.. సమీక్ష అనంతరం, బృందం బోడుప్పల్ మునిసిపల్ కమిషనర్‌ను కలసి ప్రాజెక్ట్ నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు, నిధుల కేటాయింపు, ఆరోగ్య, మునిసిపల్ శాఖల మధ్య సమన్వయంపై చర్చించి, ప్రాజెక్ట్ త్వరగా పూర్తి కావడానికి అవసరమైన చర్యలను చేపట్టాలని నిర్ణయించారు.. అనంతరం నూతనంగా నిర్మించిన నారాపల్లిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో కొరెముల్లా గ్రామలోని సబ్ సెంటర్‌ను కూడా వారు సందర్శించారు..





# జీడిమెట్ల విలేజ్ ప్రభుత్వ పాఠశాలలో.. బతుకమ్మ సంబరాలు..

## సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ వెడుకలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థులు..

## సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న విద్యార్థులు..





జీడిమెట్ల, పెన్ పవర్, అక్టోబర్ 1:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలు కెవిఎన్ సుజాత ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.. విద్యార్థులు పాఠశాలలోనే బతుకమ్మను తయారు చేసి సంబరాలు చేసుకున్నారు.. విద్యార్థులు ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు హాజరై బతుకమ్మ సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశ సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను ఇలా భావితరాలకు అందచేయటంలో ప్రభుత్వ పాటశాల ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు, ఆశ రాణి, సుజాత, రూప, స్వర్ణలత, శాంత, అరుణ జ్యోతి, రాజకుమారి, కృష్ణమాచారి, శంకర్ నారాయణ, ప్రమీల, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు..

# హైడ్రా తీరుపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయ వేసింది: ధర్మపురి అర్వింద్

## హైడ్రా పేరుతో పేదల ఇళ్లనే కూల్చేస్తున్నారని విమర్శలు

## రేవంత్ రెడ్డి పాలన కూడా కేసీఆర్ పాలనలాగే ఉందని వ్యాఖ్య

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు ఇబ్బందిపడుతున్నారన్న అర్వింద్

**హైదరాబాద్ పెన్ పవర్:** హైడ్రా తీరుపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయ వేసిందని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లనే కూల్చేస్తున్నారని, బ్లాక్‌మెయిల్ చేసి జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేపీ చేపట్టిన 'రైతుదీక్ష' ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి పాలన కూడా కేసీఆర్ పాలనలాగే ఉందని మండిపడ్డారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతు గోసను తెలియజేసేందుకే బీజేపీ ఆధ్వర్యంలో ఈ దీక్షను చేపట్టామన్నారు. రైతుల ఆదాయాన్ని ప్రధాని మోదీ రెట్టింపు చేశారన్నారు. చిన్న చిన్న పంటలకు ఏమీ చేయలేని ప్రభుత్వాన్ని నిన్న కేసీఆర్ నడిపారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి నడుపుతున్నారని విమర్శించారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కనీసం చిన్నకారు రైతుని కూడా ఆదుకోలేకపోయాయని అన్నారు. రైతుల హామీల సాధన కోసం తెలంగాణ బీజేపీ ప్రతినిధులు



చేపట్టిన 24 గంటల దీక్ష కాంగ్రెస్ కుంభస్థలంపై కుంపటిగా మారిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చేదాకా బీజేపీ వదిలిపెట్టదని హెచ్చరించారు.

# కొండా సురేఖ ఇష్యూ... మీ ఫొటో ఉపయోగించిన వారిపై కేసు పెట్టండి: హరీశ్ రావుకు రఘునందన్ రావు సూచన

- లేకుంటే తామే కేసు పెడతామన్న రఘునందన్ రావు
- అలాంటి వ్యక్తితో సంబంధం లేదని హరీశ్ రావు ప్రకటించాలని డిమాండ్
- అమ్మకు ఆలికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం
- బీఆర్ఎస్ వారికి అక్క అంటే కవిత మాత్రమేనా? అని ఎద్దేవా



**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి కొండా సురేఖపై అసభ్యకర పోస్ట్ పెట్టిన వ్యక్తి హరీశ్ రావు ఫొటోను ఉపయోగించుకున్నాడని, కాబట్టి ఆయనకు ఓ సూచన చేస్తున్నానని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఆయన ఫొటోను ఉపయోగించుకుంటున్న వారి మీద హరీశ్ రావు కేసు పెట్టాలని సూచించారు. లేదంటే వారిపై తామే కేసు పెడతామని అల్టిమేటం జారీ చేశారు. తాము కేసు పెట్టినప్పుడు హరీశ్ రావు విచారణకు సహకరించాలని, పట్టుకొచ్చిన వారి కోసం ఫోన్ కాల్ చేయవద్దన్నారు. అంతేకాదు, అలాంటి వ్యక్తితో తనకు సంబంధం లేదని హరీశ్ రావు పత్రికాముఖంగా ప్రకటన చేయాలన్నారు. బీజేపీ కార్యాలయంలో రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ... మంత్రి కొండా సురేఖ చేనేత సమస్యలు వినేందుకు దుబ్బాక వచ్చారని, అలాంటి సమయంలో ఆమెపై ట్రోల్ చేయడం పట్ల తాను బాధపడుతున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చేతనైతే సిద్ధాంతపరంగా కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలని సూచించారు. తప్పు చేస్తే విమర్శించాలని, రాజకీయంగా ఎదుర్కోవాలని, ఇంకా చేతనైతే ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలి, అంతే తప్ప వ్యక్తిత్వహననానికి పాల్పడవద్దన్నారు.

**అమ్మకు ఆలికి తేడా తెలియకుండా... అక్క అంటే కవితేనా?**

ప్రశ్నిస్తే, మా కవితక్క జైలుకు పోయినప్పుడు ఇలాంటి పోస్టులు పెట్టలేదా, మా కవితక్కను తిట్టలేదా? అని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారని, అలాంటి సమర్థన కామెంట్లు ఏమాత్రం సరికాదన్నారు. అమ్మకు, ఆలికి తేడా తెలియనంత సంస్కారహీనంగా ప్రవర్తించవద్దని హితవు పలికారు. బీఆర్ఎస్ వారికి మహిళలు అంటే కవితక్క తప్ప మరొకరు కాదనుకుంటానని విమర్శించారు.ఓ అక్కగా చేనేత కార్మికుల సమస్యలకు పరిష్కారం ఇస్తారనే ఉద్దేశంతో నోరారా అక్కా అని పిలిచి నేతన్నల సమస్యలను విన్నవించామన్నారు. కానీ మహిళా మంత్రి, బీసీ మంత్రి అని చూడకుండా ఇంత దారుణంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇలాంటి తప్పుడు పనులు చేయడం వల్ల ఇప్పటికే మీకు శిక్షపడిందని భావిస్తున్నానని, ఇంకా ఇలాంటి పిచ్చి పనులు చేస్తే ఎలా? అని నిలదీశారు.
బీఆర్ఎస్‌కు మహిళలపై సంస్కారం లేదని, అది బీఆర్ఎస్ తొలి కేబినెట్లోనే వెల్లడైందన్నారు. ఇప్పటికైనా వారు మారాలని హితవు పలికారు. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక అయినా వారికి భగవంతుడు బుద్ధి ప్రసాదించాలని, తోటి మహిళలో తల్లిని, చెల్లిని చూసే గుణం ఇవ్వాలని కోరుకుంటున్నానన్నారు.

# హైడ్రా హైడ్రోజన్ బాంబు లాంటిది..పేదోడి జోలికొస్తే ఊరుకోం: ఎమ్మెల్యే కూనంనేని



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ మిత్రపక్షమేనన్నారు సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఏడాది పాటు పరిశీలిస్తాం.. తప్పులు చేస్తే ప్రశ్నిస్తామన్నారు. హైడ్రా హైడ్రోజన్ బాంబు లాంటిదన్నారు. విధ్వంసం, వికాసానికి ఉపయోగించవచ్చన్నారు. పేదల జోలికి వస్తే ఊరుకోబోమని చెప్పారు.. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీపై గందరగోళం చేసుకున్నారని అన్నారు కూనంనేని. తులం బంగారం హామీ, మహిళలకు రెండున్నరవేల స్కీముపై క్లారిటీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాల్సిందేనని చెప్పారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు చేసిందన్నారు. బీజేపీ నేతలపై ఈడీ దాడులు ఉండబోవన్నారు కూనంనేని

# మీ తాట తీయడానికే వచ్చా: కాన్వాయ్‌పై దాడి జరిగిందంటూ కేటీఆర్ ఆగ్రహం

## ప్రజలకు అండగా ఉండే తమను ముఖ్యమంత్రి ఆపలేరన్న కేటీఆర్

## ఏ బుల్డోజర్లూ తమ గొంతును ఆపలేవన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

## తమది ఉద్యమాల పిడికిలి అన్న కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**తన కాన్వాయ్‌పై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేశాయని, కానీ వారి తాటాకు చప్పుళ్లకు తాను భయపడేవాడిని కాదని, తాట తీయడానికే వచ్చానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అంతకుముందు, అంబర్ పేటలో కేటీఆర్ కాన్వాయ్‌ను యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. మంత్రి కొండా సురేఖకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ... ఇలాంటి దాడులకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ పిల్లి కూతలకు ఎవరూ భయపడరన్నారు.ప్రజలకు అండగా ఉంటామని, దీనిని సీఎం రేవంత్ రెడ్డి ఆపలేరన్నారు. ఏ బుల్డోజర్లు తమ గొంతును ఆపలేవని వ్యాఖ్యానించారు. నీ గూండా రాజ్యాన్ని సవాలు చేసే నా స్ఫూర్తిని ఏ గూండాలు అడ్డుకోలేరని హెచ్చరించారు. వాహనంపై గూండాలు చేసిన దాడితో తన సంకల్పం మరింత పెరుగుతుందే తప్ప వెనక్కి తగ్గేది లేదన్నారు. తమది ఉద్యమాల పిడికిలి అని గుర్తుంచుకోవాలన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో వాంగ్‌చుక్‌ను కలిసేందుకు వెళ్లిన అతిశీ... అడ్డుకున్న పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:**పోలీసుల అదుపులో ఉన్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను కలిసేందుకు ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. వాంగ్‌చుక్‌ను కలిసేందుకు వెళ్లిన ఢిల్లీ సీఎంను పోలీసులు అడ్డుకున్నారు. ఈ మేరకు ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.సోనమ్ వాంగ్‌చుక్, ఆయన మద్దతుదారులు తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ గత నెల 1న లేహ్‌లో పాదయాత్రను ప్రారంభించారు. లధక్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్లో చేర్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక జనాభా, వారి భూమి, సాంస్కృతిక గుర్తింపును రక్షించడానికి ఇది చట్టాన్ని రూపొందించే అధికారం ఇస్తుందని అంటున్నారు. ఈ డిమాండ్లతో పాదయాత్ర ప్రారంభించిన సోమ్ వాంగ్‌చుక్‌ను, పలువురు అనుచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వాంగ్‌చుక్‌ను కలిసేందుకు ముఖ్యమంత్రి అతిశీ బవానా పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కానీ ఆమెను పోలీసులు అడ్డుకున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## కేటీఆర్ ను అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు.. గోబ్యాక్ అంటూ నినాదాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు నిరసన సెగ తగిలింది. ముషీరాబాద్ వద్ద ఆయనను కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకున్నాయి. గోబ్యాక్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశాయి. మూసీ నది పరీవాహక ప్రాంత నివాసితులకు భరోసా కల్పించేందుకు ఆయన వెళుతుండగా... ముషీరాబాద్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మూసీ నది రివర్ బెడ్ పరిధిలో ఉన్న నివాసాల కూల్చివేతలు ఈ ఉదయం ప్రారంభమయ్యాయి. ఖాళీ చేసిన ఇళ్లను అధికారులు కూల్చి వేస్తున్నారు. ఈ క్రమంలో ఆ ప్రాంతాల్లో భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. కూల్చివేతలను పరిశీలించేందుకు, బాధితులకు భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ నేతలతో కలిసి కేటీఆర్ చాదర్ ఘాట్ కు బయల్దేరారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు ముషీరాబాద్ వద్ద కేటీఆర్ కాన్వాయ్ ను అడ్డుకున్నాయి. కొందరు కేటీఆర్ ప్రయాణిస్తున్న వాహనంపైకి కూడా ఎక్కారు. మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ కు బాధ్యత వహిస్తూ కేటీఆర్ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో, అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపు చేశారు. కేటీఆర్ కాన్వాయ్ ను ముందుకు పంపించారు.

# రాజస్థాన్ నుంచి తెలంగాణలో లూటీ.. 27 మంది సైబర్ నేరగాళ్లు అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ సైబర్ సెక్యూరిటీ పోలీసులు రాజస్థాన్ లో భారీ ఆపరేషన్ నిర్వహించారు. మొత్తం 27 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. నిందితులను నుంచి భారీగా చెక్ బుక్స్ స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ నుంచి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు. తెలంగాణలో 200లకు పైగా సైబర్ నేరాలకు పాల్పడింది రాజస్థాన్ ముఠా. దీంతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ పోలీసులు సైబర్ నేరస్తులను పట్టుకునేందుకు రాజస్థాన్ వెళ్లారు. జయ్ పూర్, నాగ్ పూర్,జోధ్ పూర్ లో సోదాలు చేశారు. రాజస్థాన్ నేరగాళ్లు అన్ని రకాల నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

15 రోజుల అపరేషన్ లో భాగంగా 27 మంది సైబర్ క్రిమినల్స్ ను అరెస్ట్ చేశామని హైదరాబాద్ క్రైం అడిషనల్ సీపీ శిఖాగోయల్ తెలిపారు. నిందితులు అందరూ విద్యావంతులు. మొత్తం ముప్పై ఏళ్ళ లోపు వారే ఉన్నారు . ఒక్కొక్కరు పదుల కేసుల్లో నిందితులుగా ఉన్నారు . 27 మంది తెలంగాణ వ్యాప్తంగా 189 కేసుల్లో నిందితులుగా ఉన్నారు . దేశ వ్యాప్తంగా 2023 కేసులో వీళ్లు నిందితులు.వీరి వద్ద నుండి 31 మొబైల్ ఫోన్స్ 37 సిమ్ కార్డ్స్, చెక్ బుక్స్ లను స్వాధీనం చేసుకున్నామని శిఖాగోయల్ మీడియాకు వెల్లడించారు. నిందితులు 29 మ్యూల్ అకౌంట్ లను సైబర్ క్రైమ్స్ కోసం సేకరించారు . 11 కోట్లు లావాదేవీలు 29 అకౌంట్ల ద్వారా చేశారు. విచారణలో లావాదేవీల జరిపిన మొత్తం అమౌంట్ పెరిగే అవకాశం ఉంది . సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు స్పెషల్ ఆపరేషన్ చేయలేదు. స్పెషల్ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా టీం లను ఏర్పాటు చేసాము. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితులు అందర్నీ పట్టుకోగలిగం. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా టీమ్స్ బృందాలుగా డిస్ పాచ్ అయ్యి నిందితులను అరెస్ట్ చేశారు. మా బృందాలు ఎప్పటికపుడు నేరస్తుల కదలికలు, లోకేషన్ లపై నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్నారని శిఖాగోయల్ తెలిపారు.

కాంబోడియా, వియత్నాం,మయన్మార్ నుంచి కూడా నేరాలకు పాల్పడుతున్నారని శిఖాగోయల్ తెలిపారు. నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారిస్తామన్నారు. విచారణలో మరిన్ని విషయాలు బయటకు వస్తాయని తెలిపారు శిఖాగోయల్.

# కొండా సురేఖ మీద అభ్యంతరకర పోస్ట్‌పై తీవ్రంగా స్పందించిన రఘునందన్ రావు

**అక్కకు జరిగిన అవమానానికి తమ్ముడిగా విచారం వ్యక్తం చేస్తున్నానన్న బీజేపీ ఎంపీ**

**ఇలాంటి వారిని జైలుకు పంపించే వరకు తమ్ముడిగా అండగా ఉంటానని హామీ**

**హరీశ్ రావు, కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్**



**హైదరాబాద్ పెన్ పవర్:**మంత్రి కొండా సురేఖ మీద సోషల్ మీడియాలో చేసిన పోస్ట్‌పై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా స్పందించారు. సురేఖపై ట్రోలింగ్ చేసింది బీఆర్ఎస్ కార్యకర్తలే అన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సురేఖను ట్రోలింగ్ చేసిన వివరాలు సేకరించి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అక్కకు జరిగిన అవమానానికి తమ్ముడిగా తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నానన్నారు. తన వల్ల కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేస్తూ ఇలాంటి వారిని జైలుకు పంపించే వరకు తమ్ముడిగా అండగా ఉంటానన్నారు.అక్కకు మద్దతుగా ఒక వకీలుగా పోస్టులు పెట్టిన వారిని కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు ఈ అంశంపై స్పందించి సోషల్ మీడియాను కంట్రోల్ చేసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి డబ్బులు తీసుకున్న వారే ఇలాంటి ట్రోలింగ్ చేశారని మండిపడ్డారు.కొండా సురేఖపై ట్రోలింగ్ జరగడంపై హరీశ్ రావు ఒక ట్వీట్ పెట్టి వదిలేయడం కాదని, క్షమాపణ చెప్పాల్సిందే అన్నారు. అధికారిక కార్యక్రమంలో ఓ మంత్రిని గౌరవపూర్వకంగా సన్మానిస్తే ఇంత దారుణంగా పోస్టులు పెట్టడమేమిటని నిలదీశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ సందర్భంగా వేదికపై జిల్లా ఇంఛార్జ్ మంత్రి సురేఖ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, స్థానిక ఎంపీగా తాను ఉన్నానని గుర్తు చేశారు. వేలాదిమంది సమక్షంలో ఈ కార్యక్రమం జరిగిందని, ఇలాంటి కార్యక్రమాన్ని అభ్యంతరకరంగా చూపించడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయిన తర్వాత మీ పార్టీ సోషల్ మీడియా కోసం చాలామందిని నియమించుకొని తప్పుడు పోస్టులు పెడుతున్నారని, ఇలాంటి తప్పుడు రాతలు, వెకిలి చేష్టలు మానుకోవాలని హితవు పలికారు. ముఖ్యంగా మహిళా నాయకులను కించపరిచే ప్రయత్నం చేస్తే తప్పకుండా మూల్యం చెల్లించవలసి వస్తుందని కేటీఆర్‌ను హెచ్చరించారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులను ఆ పార్టీ నేతలే మరిచిపోతున్నారు: శ్రీధర్ బాబు

- 2017లోనే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేశారన్న మంత్రి
- మూసీ ప్రాజెక్టును ఎలా చేపట్టాలనే అంశంపై 2018లో సమావేశం నిర్వహించినట్లు వెల్లడి
- ఆక్రమణలను తొలగించాలని నాడు కేటీఆర్ చెప్పారని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసింది బీఆర్ఎస్ హయాంలోనే అని, గతంలో వారు చేసిన పనులను ఆ పార్టీ నేతలే మరిచిపోతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 2017లోనే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి కార్పోరేషన్లకు చైర్మన్‌ను కూడా నియమించినట్లు వెల్లడించారు.మూసీ ప్రాజెక్టును ఏవిధంగా చేపట్టాలనే అంశంపై 2018లో సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. మూసీ నదికి హద్దులతో పాటు 50 మీటర్ల బఫర్ జోన్‌ను కూడా నిర్ణయించాలని సూచించారని వెల్లడించారు. యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణలను తొలగించాలని నాటి సమావేశంలో కేటీఆర్ చెప్పారన్నారు. గత ప్రభుత్వ లెక్కల ప్రకారమే 8,480 అక్రమ నిర్మాణాలను అధికారులు గుర్తించారని తెలిపారు.మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారని గుర్తు చేశారు. అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయాలని కేటీఆర్ 2021లో ఆదేశించారని, నిర్వాసితుల పరిహారంపై కూడా చర్చించినట్లు వెల్లడించారు. ప్రజలకు శుభ్రమైన గాలి, నీరు అందించాలని నాటి ప్రభుత్వం ఆలోచించిందని భావించామని, ఇప్పుడు తాము కూడా అలాగే అనుకుంటున్నామన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రక్రియ చాలా క్లిష్టమైనదని, దానిని బీఆర్ఎస్ నేతలు మరింత సంక్లిష్టంగా మార్చుతున్నారని ఆరోపించారు.మల్లన్నసాగర్ నిర్వాసితులను ఎంత నిర్దాక్షిణ్యంగా వెళ్లగొట్టారో మరిచిపోయారా? అని ప్రశ్నించారు. కనీసం వారు ఆర్ అండ్ ఆర్ కూడా ఇవ్వకుండా బలవంతంగా వెళ్లగొట్టారన్నారు. కానీ తాము మూసీ నిర్వాసితులకు ఇళ్లు ఇస్తున్నామని వెల్లడించారు. ఉపాధి చర్యలు కూడా చేపట్టామన్నారు. అందరితో చర్చించి ముందుకు వెళుతుంటే బురద జల్లడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రేచర్లపేటలో ప్రజావేదిక కార్యక్రమం

హైదరాబాద్ పెన్ పవర్:
ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాకినాడ రేచర్ల పేట లో 4, 5, 6, 7, 8, 33 డివిజన్ల సంబంధించి ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో జగన్మోహన్ రెడ్డికి ఒక్క ఛాన్స్ ఇవ్వడంతో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం అస్తవ్యస్త పాలనతో గాడి తప్పిన రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడపడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇది మంచి ప్రభుత్వంగా

ప్రజల మనసులు చూరగొంటుందని, వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు కొండబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అధికారులు కూటమి నాయకులు మల్లిపూడి వీరు, బాబు రహీమ్, అంబటి చిన్న, గుజ్జు సూర్యావతి లక్ష్మణరావు, మమతా శ్రీనివాస్, సీకోటి అప్పలకొండ, సంగిశెట్టి అశోక్, పోలిపల్లి జగన్, బంగా నాగరాజు, వానపల్లి పోలీసు, ఏడిద కృష్ణ, కొల్లు కుమారి,

వడిసెల దానమ్మ, వీరంరెడ్డి వెంకటలక్ష్మి, ఓం నమశ్శివాయ, బొచ్చా దాసు, చిట్టీడి ధారా ప్రసాద్, వీరంరెడ్డి శ్రీనివాస్, పి. దయామని, వానపల్లి జ్యోతి, బొడ్డిపల్లి నాని, బత్తుల భవాని, బత్తున ఉమాదేవి, లక్ష్మణరావు, బొంతు సత్యనారాయణ ప్రసాద్, ఏడిద శ్రీను, నాగేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# వేయి గోవులు ఇస్తా.. లక్ష గోవులు సమకూరుస్తా

హైదరాబాద్ పెన్ పవర్:బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ సంచలన ప్రకటన చేశారు.. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటు చేసి, సొంతంగా నెయ్యి తయారీకి తన వంతుగా భూరి సాయం ప్రకటించడంతో పాటూ ఓ పెద్ద బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.. వందలాది మంది భక్తులతో కలిసి ఆయన చేపట్టిన "తిరుమల పరిరక్షణ పాదయాత్ర" మంగళవారం ఉదయం స్వామి దర్శనంతో ముగిసింది.. ఈ సందర్భంగా తిరుమలలో విలేఖరుల నిర్వహించి కీలక ప్రకటన చేశారు.. లడ్డూ ప్రసాదం తయారీలో కీలకమైన, స్వామివారికి పూజల్లో వినియోగించే నెయ్యి సొంతంగా తయారీ కోసం సూచనలు చేశారు..!

**వేయి గోవులు ఇస్తా.. లక్ష గోవులు సమీకరిస్తా..!**

కోట్లాది మంది భక్తులు.. వేల కోట్ల ఆస్తులున్న తిరుమల పుణ్యక్షేత్రంలో సొంతంగా డెయిరీ లేకపోవడం వల్లనే ఈ సమస్యలు వస్తున్నాయి.. లడ్డు ప్రసాదం సహా, పూజా నెయ్యి కూడా అపవిత్రం అవుతుంది. అందుకే సొంత డెయిరీ ఏర్పాటు చేయాలని సూచించారు.. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటు చేస్తే.. తన వంతుగా వేయి ఆవులు టీటీడీకి ఇస్తానన్నారు.. అలాగే మరో లక్ష ఆవులు సమీకరించడానికి బాధ్యత తీసుకుని పూర్తిగా సహకరిస్తానని పేర్కొన్నారు. దీనిపై టీటీడీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..× లక్ష ఆవులతో తిరులలో సొంతగా డెయిరీ ఏర్పాటు చేస్తే రోజుకి రోజుకి కనీసం 10 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుందని.., తద్వారా 50 వేల
కిలోల వెన్న ఉత్పత్తి ఉంటుందని, దీని ద్వారా రోజుకి సుమారుగా 30 వేల కిలోల నెయ్యి సొంత తయారీ సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు..× ఈ మేరకు లక్ష గోవులతో గోశాల ఏర్పాటు చేస్తే.. 10 వేల మంది గోపాలులకి ఉపాధి కల్పించవచ్చని.. వీలైతే వారిని యాదవ సామాజికవర్గం నుండి తీసుకుంటే.. గో సేవకులుగా వారు సమర్థవంతంగా, ఆసక్తిగా పని చేయగలరని సూచించారు..

## ముడా కుంభకోణంలో కర్ణాటక సీఎంపై ఈడీ కేసు..

హైదరాబాద్ పెన్ పవర్:ముడా కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య మీద మనీలాండరింగ్ కేసు ఈడీ నమోదు చేసింది. ఇప్పటికే దీనికి సంబంధించి పోలీస్ కేసు నడుస్తోంది. తాజాగా ఈడీ కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపింది. ఇప్పుడు ఈడీ సిద్ధరామయ్యతో పాటూ ఆయన భార్య పార్వతి, బావమరిది మల్లికార్జున స్వామిల మీద కూడా ఈడీ కేసు నమోదు అయింది.

## ధరలు తగ్గించాలని సిపిఎం నిరసన



హైదరాబాద్ పెన్ పవర్:ఆకాశాన్ని తాకుతున్న నిత్యవసర వస్తువుల ధరలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ జిల్లా మద్దిలపాలెం జంక్షన్ లో సిపిఎం నాయకులు నిరసన ప్రదర్శనకి దిగారు.. గత 20 రోజులుగా నిత్యవసర వస్తువుల ధరలు భారీగా పెరిగి పేదవాడికి భారంగా మారుతున్నాయని సిపిఎం నాయకులు ఆగ్రహ వ్యక్తం చేశారు... బ్లాక్ మార్కెట్లో ఎక్కువ అవ్వడం వల్ల నిత్యవసర సరుకులకు ధరలు అధికంగా పెరుగుతున్నాయి అన్నారు.. తక్షణమే బ్లాక్ మార్కెట్లను అరికట్టే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యవసర ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళారీల దోపిడీకి సహకరిస్తున్నాయని సిపిఎం నాయకులు మండిపడ్డారు...

## రామలింగేశ్వర ఆలయ ఏర్పాట్లను పరిశీలించిన ఆర్జేడీ

హైదరాబాద్ పెన్ పవర్: కాకినాడ సూర్యారావుపేటలో వేంచేసి ఉన్న శ్రీబాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగు తున్న శరన్నవరాత్రి ఏర్పాట్లును దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కె.సుబ్బారావు పరిశీలించారు. దేవస్థానానికి వేంచేసిన దేవాదాయ శాఖ ఆర్.జె.డి. కె. సుబ్బారావు దంపతుల ను ఆలయ ఈ.వో. ఉండవల్లి వీర్రాజు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని ఆర్.జె.డి కె. సుబ్బారావు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ అర్చకులు ఆర్.జె.డి దంపతులకు వేదాశీర్వచ నాలను అందజేసారు. ఈ సందర్భంగా ఆర్.జె.డి సుబ్బారావు మాట్లాడుతూ అక్టోబర్ 3 నుండి ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లును పరిశీలించడం జరిగిందని, ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు.

## కూటమి శ్రేణుల పాదయాత్ర

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష కు మద్దతుగా హనుమాన్ జంక్షన్ అభయాంజనేయ స్వామి దేవస్థానం నుంచి ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయం వరకు జనసేన నేత గరికిపాటి శివ శంకర్ ఆధ్వర్యంలో కూటమి పార్టీ శ్రేణులు పాదయాత్ర ప్రారంభించారు. సుమారు 48 కిలోమీటర్ల మేరా పాదయాత్ర సాగింది.

## హైదరాబాద్‌లో భారీగా హవాలా డబ్బు..రూ.కోటి 21లక్షల నగదు సీజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ సిటీలోని సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీగా హవాలా డబ్బు పట్టుపడింది. వాహన తనిఖీలలో రూ.1 కోటి 21 లక్షలు నగదును పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం (అక్టోబర్ 1) సాయంత్రం సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొగ్గులకుంటలో వాహనాల తనిఖీలు చేస్తుండగా.. టీసీఎస్ జుపిటర్ బైక్ వెళ్తున్న ఇద్దరిని అపేందుకు యత్నించగా తప్పించుకొని పోయారు.. వెంబడించిన పోలీసులు ఇద్దరిని కోఠి హనుమాన్ టెక్డీ వద్ద పట్టుకున్నారు. రాజస్థాన్ కు చెందిన లక్ష్మణ్ (27), వసంత్ (24) లు తీసుకెళ్తున్న బ్యాగ్ ను చెక్ చేయగా..అందులో కోటి రూపాయల నగదు బయటపడింది. పట్టుబడ్డ లక్ష్మన్, వసంత్ లను విచారించగా.. తరుణ్ అనే మరో వ్యక్తి పేరు చెప్పారు.. దీంతో హనుమాన్ వ్యాయామ శాల వద్ద ఉన్న ఓ ఆపార్టమెంట్ ఉన్న తరుణ్ అదుపులోకి తీసుకున్నారు.. అతని వద్ద రూ. 21లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ముంబైలోని బబ్లూ అనే హవాలావ్యాపారి ఆదేశాల మేరకు తాము పనిచేస్తున్నట్లు పట్టుబడ్డ నిందితులు చెప్పారు. నగరంలోని వ్యాపారులనుంచి ఈ లావాదేవీలు సాగిస్తున్నట్లు డీసీపీ బాలస్వామి చెప్పారు. హవాలాడబ్బు తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి కోటి 21లక్షల నగదును సీజ్ చేసి ఇన్ కమ్ టాక్స్ అధికారులకు అప్పగించినట్లు డిసీపీ చెప్పారు. ప్రధాన నిందితుడు బబ్లూ ను తర్వలో అరెస్ట్ చేస్తామని డీసీపీ చెప్పారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..తిరుపతన్న బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు తిరుపతన్నకు హైకోర్టు బెయిల్ నిరాకరించింది. బెయిల్ మంజూరు చేయాలని తిరుపతన్న వేషిన పిటిషన్ మంగళవారం ( అక్టోబర్ 1) హైకోర్టు విచారణ చేపట్టింది. దర్యాప్తు కీలక దశలో ఉందని బెయిల్ ఇస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని పోలీసుల తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన హైకోర్టు తిరుపతన్నకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్ కొట్టివేసింది. ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ప్రాథమిక ఆధారాలున్నాయన్న హైకోర్టు.. ఈ దశలో బెయిల్ మంజూరు చేయలేమని చెప్పింది. ఫోరెన్సిక్ ల్యాబరేటరి నివేదిక ప్రకారం..దర్యాప్తు కొనసాగించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

# అక్రమార్కులను వదిలిపెట్టేది లేదు.. తప్పకుండా చర్యలు ఉంటాయి





**హైదరాబాద్ పెన్ పవర్:** మూసీ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సర్వేపై మూసీ పరివాహక ప్రాంతాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది..ఈ క్రమంలో చైతన్యపురిలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు కాంగ్రెస్ సీనియర్ నేత మధు యాష్కీ గౌడ్. బాధితులతో మాట్లాడిన మధు యాష్కీ కూల్చివేతలపై ఎటువంటి ఆందోళన వద్దని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అంటేనే పేదలకు ఇండ్లను ఇచ్చే ప్రభు త్వమని..ఎవరి ఇండ్లు కూలగొట్టదన్నారు. అక్రమార్కులను వదిలిపెట్టేది లేదని, అక్రమాలకు పాల్పడ్డ అధికారులు, కబ్జా రాయుళ్లు, బిల్డర్లపై తప్పకుండా చర్యలు ఉంటాయని హెచ్చరించారు మధు యాష్కీ.

మూసీలో ప్రవహించే మురుగునీరు వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా మంచినీటిని ప్రవహింప చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. అన్యాయంగా ప్రజల ఇండ్లు కూల గొడితే..అధిష్టానం కూడా జోక్యం చేసుకుంటుందన్నారు మధు యాష్కీ గౌడ్. సీఎం రేవంత్ రెడ్డి కూడా తన స్వార్థం కోసం మూసీసుందరీకరణ చేపట్టడం లేదన్నారు.

మూసీలో ప్రవహించే మురు గునీరు వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా ఐదు టీఎంసీల గోదావరి నీటిని ప్రవహింపజేసి..మురుగు కంపు తొలగించి, మంచినీటిని ప్రవహింప చేయాలన్న సంకల్పం ప్రభుత్వానికి ఉందన్నారు మధు యాష్కీ.నోటీసులు ఇవ్వకుండా, ప్రజల అంగీకారం లేకుండా ఏ ఇల్లు కూలదన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఇళ్ళు కూల్చాలి అంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ విలువకు నాలుగింతల నష్టపరిహారం చెల్లించాల్సిందేనని పేర్కొన్నారు. మూసికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించి సుందరీకరణ కూడా చేయవచ్చు అని పేర్కొన్నారు. నదికి ఇళ్లు ఉన్న వైపు కాకుండా.. పొలాలు ఉన్న వైపు ఎక్కువ స్థలాన్ని సేకరించి సుందరికరణ చేయవచ్చు అని సూచించారు.

# సంచలనం... సర్పంచ్ పదవి కోసం రూ. 2 కోట్లు!




**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్ని సంఘటనలు పరిగణలోకి తీసుకున్నప్పుడు భారతదేశంలో రాజకీయాలకంటే మెరుగైన, మేలైన, లాభదాయమైన వ్యాపారం మరొకటి లేదని ఒకరంటే... పెట్టుబడి కూడా అదే స్థాయిలో ఉంటుందని మరికొంతమంది చెబుతుంటారు. ఈ క్రమంలో ఆ కామెంట్స్ కు బలం చేకూరుస్తూ.. సర్పంచ్ పదవి కోసం రూ.2 కోట్లు అనే విషయం తెరపైకి వచ్చింది. అవును... గురుదాస్ పూర్ జిల్లాలోని హర్డోవల్ కలాన్ సరిహద్దు గ్రామం, సర్పంచ్ పదవికి వేలం వేసింది! ఈ వేలంలో ఆ సర్పంచ్ పదవి రూ.2 కోట్ల మార్కును తాకడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశం అయ్యింది. ఈ వ్యవహారంలో స్థానిక బీజేపీ నాయకుడు ఆత్మసింగ్ అత్యధిక బిడ్ వేయడం ద్వారా మిగిలిన ఇద్దరు ప్రత్యర్థులను ఓడించారు.

ఈ గ్రామంలో సర్పంచ్ పదవి కోసం ప్రధానంగా ముగ్గురు మధ్య భారీ పోటీ నెలకొంది. ఇందులో భాగంగా బీజేపీ నుంచి ఆత్మసింగ్, జస్విందర్ సింగ్ బేడి, నిర్భైర్ సింగ్ లు పోటీ పడ్డారు. ఈ సమయంలోనే ఆత్మసింగ్ రూ.2 కోట్లు బిడ్ వేసి సర్పంచ్ పదవిని దక్కించుకున్నారు. ఈ నిధులు గ్రామ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, పంచాయతీ గ్రాంటులతో సంబంధం లేకుండా నిధులను ఉపయోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది ఆ గ్రామ యువజన సమ్మేళనం! ఇలా వేలం వేసి సర్పంచ్ ను ఎన్నుకునే విషయంలో ఈ గ్రామం పేరు గడించిందని చెబుతున్నారు. %ూశ్రీంశీ =ఘుం% - ఆ విషయంలో పెద్దల చేతులు జనరేషన్ ఆల్ఫా, జడ్ ల చేతుల్లోనే..! వాస్తవానికి ఈ వేలం రూ.50 లక్షలతో ప్రారంభమైంది. అనంతరం వేగంగ పెరగడం మొదలైంది. ఈ సమయంలో ఆత్మసింగ్ ఈ పదవి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్పందించిన ఆయన... తన తండి కూడా గతంలో సర్పంచ్ గా పనిచేశారని.. ఆయన చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాను కూడా సర్పంచ్ కావాలని నిర్ణయించుకుని.. గరిష్టంగా ఆఫర్ చేయాలని ఫిక్సైనట్లు తెలిపారు. ఈ గ్రామంలో 350 ఎకరాల భూమి ఉందని.. తాను బాద్యతలు స్వీకరించిన తర్వాత, గ్రామంలోని యువకులతో కలిసి మరింత అభివృద్ధికి కృషి చేస్తానని ఆత్మసింగ్ చెప్పుకొచ్చారు.